సాక్షి ప్రకాశం

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025

I



మాకే అమ్మాలి..మేమే అమ్మాలి

మార్కాపురంలో టీడీపీ నేతల ఇసుక దందా కొనసాగుతోంది. లారీల యజమానులను బెదిరించి ప్రజల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు.

- IIలో..



వెల్లువెత్తిన ఫిర్యాదులు

ప్రకాశం భవనంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కలెక్టర్ రాజాబాబు అర్జీలు స్వీకరించారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం 34 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్ రాజాబాబును కలిసి మొక్క అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఒంగోలు సబర్బన్: కలెక్టర్ పీ రాజాబాబును ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేశారు. అనంతరం ఇద్దరు జిల్లాలోని పరిస్థితుల గురించి కొంత సేపు చర్చించుకున్నారు.

శనగలు క్వింటా రూ.10 వేలకు కొనాలి

- లేకుంటే రూ.3 వేల బోనస్ ఇవ్వాలి
- ఉప్పుగుండూరులో శనగ రైతుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న హనుమారెడ్డి

నాగులుప్పలపాడు: జిల్లాలో రైతుల వద్ద నిల్వ ఉన్న శనగలను క్వింటా రూ.10 వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేకుంటే రూ.3 వేల బోనస్ ఇవ్వాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు, కిసాన్ సంయుక్త మోర్చ నాయకుడు హనుమారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పుగుండూరు మార్కెట్ యార్డ్ లో కిసాన్ సంయుక్త మోర్చ ఆధ్వర్యంలో సోమవారం శనగ రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిబాబు, హనుమారెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా శనగపంట సాగుచేశారని, గత రెండు సంవత్సరాలు ఎన్నో ఒడిదుడుకులు అధిగమించి పండించిన శనగ పంటను కోల్డ్ స్టోరేజ్ ల్లో నిల్వచేశారని చెప్పారు. విత్తనం వేసేటప్పుడు క్వింటా రూ.10 వేలు ఉన్న శనగ రేట్లు ఒక్కసారిగా రూ.5 వేలకు దిగజారడంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టు మిట్టాడుతున్నారన్నారు. ఒక పక్క తెగుళ్ల, మరోపక్క రేట్లు దిగజారడంతో రైతాంగం పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో కోల్డ్ స్టోరేజ్ ల్లో నిల్వ ఉన్న శనగలను క్వింటా రూ.10 వేలకు కొనాలని, లేదా రూ.3 వేలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు టీ శ్రీకాంత్, జీ బసవపున్నయ్య, చెరుకూరి వాసు, గాదె నాగేశ్వరరావు, వివిధ గ్రామాల శనగ రైతులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లోని సహజ సంపదను తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా దోచుకుంటున్నారు. తెల్లరాయి మొదలుకుని, కలప, చిల్లకర్ర, కొండ కర్ర, జామాయిల్ కర్ర, ఇసుక, మట్టి.. ఇలా ఏది దొరికితే అది అందినకాడికి దండుకుంటూ రూ.లక్షలు దోచుకుంటున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడికి అధికారులు తలొగ్గుతున్నారా.. లేక అక్రమ దందాలో తమ వంతు వాటాలు తీసుకుని మిన్నకుంటున్నారో కానీ అడవిలో మాత్రం కూటమి దొంగలు రెచ్చిపోతున్నారు.



భైరవకోన బీట్ కొండ ప్రదేశం



తెల్లరాయి తవ్విన ప్రదేశం

కారడవిలో కూటమి దొంగలు

- కొండ కలప, కర్రను కొట్టేస్తున్నారు
- యథేచ్ఛగా అటవీ భూముల్లో తెల్లరాయి, మట్టి తవ్వకాలు
- అక్రమ దందాలో అన్ని శాఖల అధికారులకు వాటా !
- సీఎస్‌పురం మండలంలో ఇద్దరు ఫారెస్ట్ అధికారులు సస్పెన్షన్
- పై స్థాయికి ఫిర్యాదులు వెళ్తే.. నామ్‌కే వాస్తే దాడులు

కనిగిరిరూరల్:

ఇష్టారీతిగా సహజ వనరులను దోచుకుంటూ అధికార పార్టీ నేతలు సంపద సృష్టించుకుంటున్నారు. నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సరిహద్దులో ఉంటుంది. నల్లమల అడవిలోని భైరవకోన బీట్, అంబవరం బీట్‌లలో జోరుగా కలప (జానా, ఇల్లూరు, కోయ, ఊటీ, చీమచింత, మద్ది, జామాయిల్, చిల్ల, ఇలా పలు రకాల జాతి కర్రలు), కొండ కర్రలను యథేచ్ఛగా కొట్టి తరలిస్తూ.. కూటమి నేతలు లక్షలు గడిస్తున్నారు. కొద్ది కాలం క్రితం భైరవకోన కొండ అటవీ ప్రాంతంలో తుంగోడు, మైలుచర్ల, దేవకిమద్రి కొండల్లో ఎర్ర చందనం కర్రను తరలించేందుకు సిద్ధంగా ఉంచగా.. దాడులకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులు అధికార పార్టీ నేతల ఒత్తిడితో అవి ఫారెస్ట్ పరిధిలో లేవంటూ రాత్రి రాత్రికి గప్‌చుప్‌గా వెనక్కి తిరిగినట్లు సమాచారం. దీనిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగినా.. అధికారులు అధికార పార్టీ నేతల ఒత్తిడితో మౌనం దాల్చారనే ఆరోపణలున్నాయి.



అడవి కర్రతో పట్టుబడిన లారీ



పీసీపల్లిలో చిల్ల కర్రను తరలిస్తున్న దృశ్యం

అనుమతి గోరంత.. దోపిడీ కొండంత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటవీ భూముల్లోని పలు రకాల జాతి కర్రలను యథేచ్ఛగా కొడుతున్నారు. నామమాత్రంగా అనుమతులు తీసుకుని కొండంత దోపిడీకి పాల్పడుతూ రూ.లక్షలు దోచుకుంటున్నారు. ఇందుకు ఉదాహరణ రెండు వారాల క్రితం సీఎస్‌పురం మండలంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న కొండ కర్ర లారీని అధికారులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఒక రకమైన కర్ర కొట్టేందుకు అనుమతి తీసుకుని మరో రకమైన జాతి కర్రను తరలిస్తుండగా ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారులు పట్టుకున్నారు. సుమారు రూ.1.50 లక్షల విలువైన కర్రను, లారీని సీజ్ చేశారు. ఈ కేసులో ఒక ఎఫ్‌బీవో, సెక్షన్ అధికారిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

> **అక్రమంగా తెల్లరాయిని తవ్వినా, కొండ కర్రను తరలించినా కఠిన చర్యలు**
>
> ఫారెస్ట్ భూముల్లో అక్రమంగా, అనుమతి లేకుండా తెల్లరాయిని తవ్వినా, కొండ భూముల్లో, అటవీ ప్రాంతాల్లో కర్రను, కలపను, చిల్ల కర్రను కొట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం. కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో గట్టి నిఘా ఏర్పాటు చేశాం. ఇటీవల అనుమతి లేకుండా తరలిస్తున్న సుమారు రూ.1.40 లక్షల విలువైన కర్రను పట్టుకున్నాం. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఎస్ పురం మండలంలోని ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశాం. పీసీపల్లి మండలం ఏరియాలో పొగాకు రైతులు ఎక్కువగా అనుమతి లేకుండా చిల్లకర్రను కొడుతున్నట్లు తెలిసింది. నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం. సీఎస్‌పురం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఎర్ర చందనం దుంగల అక్రమ తరలింపు జరగడం లేదు. కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పటిష్ట నిఘాకు అధికారులకు, సిబ్బందికి గట్టి ఆదేశాలిచ్చాం. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తీసుకుంటాం.
>
> – తుమ్మా ఉమామహేశ్వరరెడ్డి, కనిగిరి ఫారెస్ట్ రేంజర్

కొట్టుకున్నోడికి కొట్టుకున్నంత..

పీసీపల్లి మండలంలో అధికార పార్టీ నేతల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఓ వైపు తెల్లరాయి.. మరో వైపు ఇసుక, ఇంకో వైపు మట్టి ఇలా అన్ని రకాల సహజ వనరులను దోచుకుంటున్నారు. రెవెన్యూ, ఫారెస్ట్, భూముల్లో జోరుగా తెల్లరాయి అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. మైనింగ్ శాఖ అధికారులు నామ్‌కే వాస్తే దాడులు చేసి.. మమ అనిపిస్తున్నారు. ఇక చిల్లకర్ర, జామాయిల్ కర్రలను యథేచ్ఛగా కొడుతున్నారు. అన్నపరెడ్డిపల్లి, కోడూరివారిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని అటవీ భూముల్లో, చెరువు భూముల్లోని చిల్లకర్రను భారీగా కొట్టి తరలించుకుంటున్నా ఇరిగేషన్, ఫారెస్ట్, మైనింగ్ అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు.

జోరుగా జామాయిల్ కర్ర కొట్టివేత

పీసీపల్లి, వెలిగండ్ల, సీఎస్‌పురం, పామూరు మండలాల్లోని శివారు ప్రాంతాల్లోని అటవీ భూముల్లో జామాయిల్ కర్రను అధికార పార్టీ నేతలు అక్రమంగా కొట్టి తరలించుకుంటున్నారు. ఈ అక్రమ దందా వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. కొద్ది రోజుల క్రితం అక్రమంగా కొట్టి తరలిస్తున్న జామాయిల్ కర్రలోడును వెలిగండ్ల పోలీసులు పట్టుకున్నారు. సీఎస్‌పురం, హెచ్‌ఎంపాడు మండలాల్లో జోరుగా జామాయిల్ కర్రను ప్రభుత్వ భూముల్లో కొడుతున్నారు.

> **తరలిపోతున్న తెల్లరాయి..**
>
> కనిగిరి ప్రాంతంలోని తెల్లరాయికి ఎక్కువ గిరాకీ ఉండటంతో అధికార పార్టీ నేతల అండతో నియోజకవర్గంలో జోరుగా అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు. కొద్ది కాలం క్రితం కనిగిరి, వెలిగండ్ల మండలాల శివారు ప్రాంతాల్లో సుమారు రూ.10 లక్షల విలువైన తెల్లరాయిని అధికారులు పట్టుకోగా.. పీసీపల్లి మండలంలోని మురుగమ్మిలో, గుంటుపల్లి ఏరియాల్లో మైనింగ్, విజిలెన్స్ అధికారులు రెండు దఫాలు తెల్లరాయిని ఫారెస్ట్, రెవెన్యూ భూముల్లో తరలిస్తుండగా పట్టుకున్నారు. పీసీపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని రెవెన్యూ, అటవీ భూముల్లో గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు తదితర ప్రాంతాలకు చెందిన వారు స్థానిక అధికార పార్టీ నాయకులతో ములాఖత్ అయి.. వారి వాటా వారికి చెల్లిస్తూ.. గప్ చుప్‌గా రాత్రి వేళల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. వచ్చిపట్టుకునే పరిస్థితి లేదు. ఇటీవల జమ్మలమడక, నాగిరెడ్డిపల్లి కొండ వద్ద అటవీ భూముల్లో తవ్విన తెల్లరాయిని స్థానిక ఫారెస్ట్ అధికారులు పట్టుకోవడం తప్ప.. మిగిలిన అధికారులు ఆవైపు కన్నెత్తి చూసింది లేదు. ఇక కనిగిరి, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో కొందరు అర ఎకరా భూమిలో తెల్లరాయి తవ్వకానికి అనుమతి పొంది.. పది ఎకరాల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ దోచుకుంటున్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన గళం

- తమ న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా భారీ ర్యాలీ
- ఒంగోలులో కదం తొక్కిన వందల మంది విద్యుత్ ఉద్యోగులు
- అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు



చర్చి సెంటర్‌లో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఒంగోలు సబర్బన్: తమ న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా సోమవారం ఒంగోలు నగరంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అన్ని యూనియన్లకు చెందిన విద్యుత్ ఉద్యోగులు ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. రామ్ నగర్‌లోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా పరిపాలనా కేంద్రం కలెక్టరేట్ వరకు విద్యుత్ ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏపీసీపీడీసీఎల్ డిస్కం జేఏసీ చైర్మన్ రాచగర్ల సంజీవరావు, ఏపీసీపీడీసీఎల్ కన్వీనర్ బి.సురేశ్, ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్.హరికృష్ణ, కన్వీనర్ కేవీ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ భవన్ వద్ద యూనియన్ నాయకులు, ఏపీసీపీడీసీఎల్ డిస్కం జేఏసీ చైర్మన్ రాచగర్ల సంజీవ రావు మాట్లాడుతూ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ప్రకారం స్కేల్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు. మాస్టర్ స్కేలు గరిష్ట పరిమితితో నిమిత్తం లేకుండా వార్షిక, ప్రమోషన్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఇంజినీర్ ఖాళీల్లో నియమించాలని కోరారు. ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజినీర్లకు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతిలో ఒక అవకాశం కల్పించాలని, ఫీల్డ్ విభాగంలో తగినంత సిబ్బంది లేనందున వినియోగదారుల సేవల్లో జాప్యం జరుగుతున్న కారణంగా ఎస్‌ఓపీ నామ్స్ పేరుతో ఉద్యోగుల నుంచి అపరాధ రుసుం మినహాయిస్తున్న విధానాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. 33/11 కేవీ సబ్ స్టేషన్లను కాంట్రాక్టుకు ఇవ్వడం ఆపాలన్నారు. 01.07.1993కు ముందు నియమితులైన ఉద్యోగులకు వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను తొలగించాలన్నారు. ఉద్యోగుల సమస్యల నివారణకు, పూర్వపు పద్ధతిలో మూడు నెలలకు ఒకసారి సర్కిల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పీఎన్‌సీ సమావేశాలు పునరుద్ధరించాలని కోరారు. గతంలో అంగీకరించిన విధంగా అన్ని విభాగాలలోనూ, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అమల్లో ఉన్న పని ప్రమాణాల ప్రకారం అదనపు పోస్టులు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ సంస్థల్లో ఉన్న అన్ని ట్రస్టులను బలోపేతంచేసి మూడు నెలలకు ఒకసారి ట్రస్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో యాక్సిడెంట్స్ జరిగినప్పుడు సాంకేతికపరమైన అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని, సమగ్ర విచారణ జరిపిన తదుపరి మాత్రమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలన్నారు. ఏపీడీసీఎల్ కన్వీనర్ బి.సురేశ్, ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్.హరికృష్ణ, కన్వీనర్ కేవీ రవి, డి.మనోహర్ సురేష్, రవికాంత్, ఆనందరావు, తేళ్ల జాన్సన్, అంజయ్య, చంద్రశేఖర్, జబ్బార్, బి.వెంకటేశ్వర్లు, నరసింహారావు, వాహబ్, మల్లికార్జున్, అద్దంకి సురేష్, చీరాల మనోహర్, చుక్క రవి, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సెక్రటరీ వెంకట్రావు, బాలాజీ, తదితర నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

పద్మవాహనంపై బాలత్రిపురసుందరి



పద్మవాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తి

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన త్రిపురాంతకంలో బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలా త్రిపురసుందరి అలంకారంలో పద్మవాహనంపై అమ్మవారిని ఊరేగించారు. నవ రాత్రుల్లో ప్రతిరోజు ప్రత్యేక అలంకారాలు, వాహనసేవలు నిర్వహిస్తారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు పెరుగుతున్న వరద



గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోని వరద నీటిని పది గేట్ల ద్వారా నదిలోకి వదులుతున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద నిర్మించిన కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు రోజు రోజుకూ వరదనీటి ఉధృతి పెరిగిపోతోంది. గుండ్లకమ్మ రిజర్వాయర్ పై ప్రాంతాల్లో మూడు రోజులుగా పడుతున్న వర్షాలతో భారీగా వరద నీరు రిజర్వాయర్‌కు చేరుతోంది. వీటితో పాటు ముండ్లమూరు మండలంలోని మారెళ్ల గ్రామం వద్ద ఉన్న ఈదర వాగు, తాళ్లూరు మండలంలోని చిలకలేరు, దోర్నపు వాగు, అద్దంకి మండలంలోని నల్లవాగులు పోటెత్తడంతో గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి 20 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో రిజర్వాయర్ పది గేట్లను 0.5 అడుగుల ఎత్తు లేపి 24,464 క్యూసెక్కుల నీరు గుండ్లకమ్మ నదిలోకి ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో విడుదల చేస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 23.95 మీటర్ల ఎత్తున 3.40 టీఎంసీల నీటిని నిలుపుదల చేసినట్లు చెప్పారు. నీటి ఉధృతిని అంచనా వేస్తూ అదనంగా వచ్చే నీటిని ఎప్పటికప్పుడు గుండ్లకమ్మ నదిలోకి వదులుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాల చైర్మన్‌ను పక్కన పెట్టి...

- ఎటువంటి హోదా లేకున్నా కూటమి నాయకుడితో ప్రారంభోత్సవాలు



కంటి సేవా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కూటమి నాయకుడు ఎరిక్షన్‌బాబు

యర్రగొండపాలెం: ప్రభుత్వ వైద్యశాల చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను సిబ్బంది పక్కనపెట్టి ఎటువంటి హోదాలేని కూటమి నాయకుడితో ప్రారంభోత్సవం చేయించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఆ నాయకుడు నిస్సిగ్గుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా వైద్యశాలలో కంటి సేవా సెంటర్‌ను కూటమి నాయకుడు గూడూరి ఎరిక్షన్ బాబుతో ప్రారంభోత్సవం చేయించారు. ఆ వైద్యశాలకు ఎమ్మెల్యే చైర్మన్ అయినప్పటికీ కూటమి నాయకుడి సలహా మేరకు ఆయనకు ఆహ్వానం పంపలేదని తెలిసింది. అధికారం ఉందని పచ్చనేతలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. వైద్యశాల సిబ్బంది భయంతోనే టీడీపీ నాయకులను ఆహ్వానించాల్సి వచ్చిందని పలువురు తెలిపారు. ఇటువంటి పరిస్థితి అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాల్లో చోటు చేసుకుందని ప్రజలు విమర్శిస్తున్నారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో 24న జాబ్ మేళా

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాన్ బాస్కో దిశ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో అపోలో, ఎంఆర్‌ఎఫ్ టైర్స్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్, బ్రహ్మ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, మెడ్‌ప్లస్, ఫార్మసీ, పీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, శ్రీ హ్యుందాయ్ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లెక్స్‌టెక్ సొల్యూషన్స్, ఎస్‌బీఐ లైఫ్ బీమా, శంకర్ కియా ఆటోమొబైల్, పయనీర్ మహీంద్రా, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఆస్ట్రోటెక్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్, యూనిచార్మ్, సీఐఐ, ఎంసీసీ తదితర కంపెనీల్లో ట్రైనీ ప్రొడక్షన్, మెషిన్ ఆపరేటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, సిస్టమ్ ఆపరేటర్, డెవలప్‌మెంట్ మేనేజర్, బిజినెస్ అసోసియేట్, యూఎస్ ఐటీ రిక్రూటర్, కేడ్ ఆపరేటర్, డెవలప్‌మెంట్ మేనేజర్, బిజినెస్ అసోసియేట్, యుఎస్ ఐటీ రిక్రూటర్, కేడ్ ఆపరేటర్లు, సైట్ ఇంజినీర్లు, తదితర సెక్టార్‌లలో ఖాళీలను భర్తీ చేయడానికి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిప్లమో, డిగ్రీ విద్యార్హతతో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అర్హత ఉన్న, ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకూ జీతం, పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. ఒంగోలు శ్రీనివాస సినిమా హాల్ సమీపంలో ఉన్న డాన్ బాస్కో, ఐటీఐలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు 08592–281776 అనే నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఉచిత ఇసుక ఎక్కడ..?

● సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం నేతల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఉచిత ఇసుక అమలు కావడం లేదని సీపీఎం నేతలు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు రఫీ, సోమయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీ ఏమైందని ప్రశ్నించారు. టన్ను రూ.900లకే లారీ యజమానులు ఇస్తామని చెబుతుంటే, వారిని బెదిరించి కూటమి నాయకులు టన్ను రూ.1350 చొప్పున అమ్ముతుంటే మార్కాపురం ప్రజలకు ఉచిత ఇసుక దక్కేనా అని ప్రశ్నించారు. చిన్న చిన్న గృహ అవసరాలకు, మరమ్మతులకు కూడా ఇసుక అందని ద్రాక్షలా మారిందన్నారు. ఇసుక దందాను అరికట్టి ప్రజలకు అందుబాటులో ఇసుకధరలను అందుబాటులో ఉంచి భవన నిర్మాణ కూలీలను, భవన నిర్మాణ యజమానులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వినతిపత్రం ఇచ్చారు.

26న సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

ఒంగోలు: పురుషుల, సబ్ జూనియర్స్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ఈనెల 26న టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఏపీ సాఫ్ట్‌బాల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నరశింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. 2011 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే సబ్ జూనియర్స్ ఎంపికకు అర్హులు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధ్రువపత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని నరశింహారెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పేర్ని తిరుపతి స్వామి సెల్: 9949564264, త్రినాథ్‌బాబు సెల్: 9398479248 ను సంప్రదించాలన్నారు.

భార్య చికెన్ వండలేదని యువకుడి ఆత్మహత్య

యర్రగొండపాలెం: భార్య చికెన్ వండలేదని భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన యర్రగొండపాలెం మండలంలోని గోళ్లవిడిపి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై పి.చౌడయ్య కథనం మేరకు ఇంట్లో రోజూ పచ్చడి అన్నం పెడుతున్నావని ఇళ్ల లక్ష్మీనారాయణ (25) తన భార్యతో గొడవ పడ్డాడు. ఆదివారం కావడంతో చికెన్ తినాలని ఉందని చెప్పినా ఆమె చికెన్ వండకపోవడంతో లక్ష్మీనారాయణ తీవ్రమనస్తానికి గురై పొలానికి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుమందు తాగి బాలిక ఆత్మహత్య



అంజలీబాయి మృతదేహం

యర్రగొండపాలెం: పురుగుమందు తాగి బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంలో సోమవారం జరిగింది. ఎస్సై పి.చౌడయ్య కథనం మేరకు..దేశావత్ అంజలీబాయి(16)అనే బాలిక తన తమ్ముడు మంత్రూనాయక్‌ను బావి వద్దకు వెళ్లి నీళ్లు తీసుకురమ్మని చెప్పగా..అతను నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన అంజలీబాయి అలిగి పొలానికి వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మంగ్లీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాకే మేమే అమ్మాలి

ప్రభుత్వం మాది..ఇక్కడ ఎవ్వరూ ఏం చేయడానికి లేదు. మేం ఏది చెబితే అదే చేయాలి. లేదంటే అక్రమ కేసులు బనాయిస్తాం.. ఇదీ మార్కాపురంలో టీడీపీ నేతల తీరు. ఓ పక్క ఇసుక ఉచితమంటూ ప్రభుత్వం ప్రకటనలిస్తుంటే..స్థానిక టీడీపీ నేతలు మాత్రం ఇసుకను అడ్డుపెట్టుకొని రూ.లక్షలు కొల్లగొట్టేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎవ్వరూ ఇసుక విక్రయించకుండా పోలీసులను అడ్డంపెట్టుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

- మార్కాపురంలో టీడీపీ నేతల ఇసుక దందా
- స్థానికంగా ఎవ్వరూ ఇసుక విక్రయించకుండా బెదిరింపు
- పోలీసులను అడ్డు పెట్టికొని అక్రమ కేసులు
- టన్నుకు రూ.500 అదనంగా విక్రయం
- నెలకు రూ.లక్షల్లో సంపాదన



యార్డుల్లో విక్రయిస్తున్న ఇసుక

మార్కాపురం:

మార్కాపురం నియోజకవర్గంలో టీడీపీ నేతల ఇసుక దందా కొనసాగుతోంది. పేరుకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకే అమ్ముతున్నామని చెప్పినా..మరో పక్క లారీల యజమానులను బెదిరించి ప్రజల అవసరాలను టీడీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. మార్కాపురం ప్రాంతంలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో అటు విజయవాడ, ఇటు నెల్లూరు నుంచి లారీల్లో ఇసుకను తెస్తున్నారు. పలువురు లారీ యజమానులు టన్ను రూ.800 నుంచి రూ.900లకు వినియోగదారులకు ఇస్తామని బహిరంగంగా ప్రకటించారు. అయితే టీడీపీ నేతలు ఎక్కడి నుంచి ఇసుక తెచ్చినా తమకే అమ్మాలని వారిపై పోలీసుల ద్వారా ఒత్తిడి తెస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారు. మార్కాపురం, పొదిలిలో ఇటీవల ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. లారీ యజమానుల నుంచి కొనుగోలు చేసిన ఇసుకను టీడీపీ నాయకులు టన్ను రూ.1300 చొప్పున విక్రయిస్తున్నారు. వారు చెప్పినట్లు వినకుంటే పోలీసులు, గనులశాఖ అధికారులతో దాడులు చేయిస్తున్నారు. మార్కాపురం, పొదిలి పట్టణాల్లో ఇటీవల ఇద్దరు లారీ యజమానులు వినియోగదారులకు కావాల్సిన ఇసుకను నేరుగా తెప్పించగా నిబంధనల పేరుతో పోలీసులు వెళ్లి ఆ లారీలను స్టేషన్‌కు తరలించారు.

టీడీపీ, జనసేన మధ్య చిచ్చు..

ఇసుక వివాదం మార్కాపురంలో టీటీడీపీ, జనసేనల మధ్య చిచ్చురేపింది. లారీ యజమాని జనసేన నేత కాశీరాంసింగ్ మరికొందరు ఇటీవలే ఒంగోలుకు వెళ్లి ఇసుక అక్రమ దందాపై ఎస్పీకి, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అయినా స్పందన లేదు. కాగా మార్కాపురం పట్టణంలో వారం రోజుల క్రితం టీడిపి నేతల ఇసుక దందాపై సీపీఎం నాయకులు ధర్నా చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. మార్కాపురం ప్రాంత లారీ యజమానులు ఇసుకను నెల్లూరు జిల్లా సంగం నుంచి టన్ను రూ.250 నుంచి రూ.300 మధ్య కొనుగోలు చేసి తెస్తారు. ఆ ఇసుకను మార్కాపురంలోని ఇసుక యార్డు యజమానికి రూ.800 నుంచి 900 మధ్య విక్రయిస్తారు. అదే అయితే ఇసుకను టన్ను రూ.1300 ప్రకారం యార్డుల్లో అమ్ముతున్నారు. ఈ ధరలకు కొనలేని భవన యజమానులు నేరుగా ఆధార్‌కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో బుక్‌చేసి తెప్పించుకుందామని ప్రయత్నిస్తే ఆ లారీ యజమానులపై పోలీసుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులో యజమాని చెప్పిన ధరకే కొనాల్సి వస్తోంది. దీనిని నియంత్రించాల్సిన గనుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.



పొదిలి పోలీసుస్టేషన్ వద్ద ఉన్న ఇసుక లారీ(ఫైల్)



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

వెల్లువెత్తిన ఫిర్యాదులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కొత్తపట్నం గ్రామస్తులు

ఒంగోలు సబర్బన్: ప్రకాశం భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. కలెక్టర్ పి.రాజాబాబు వినతిపత్రాలు స్వీకరించారు. బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటి కలపూడి జయరాం విద్యాశాఖ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఇటీవల సస్పెండ్ అయిన సింగరాయకొండ మండల ఊళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పిల్లి హజరత్తయ్యపై పోక్సో కేసు పెట్టాలని డీఈఓ ఆదేశాలు జారీ చేసినా ఆ టీచర్‌కు ఓ కార్పొరేషన్ చైర్మన్ అండగా ఉండటంతో ఇంత వరకు కేసు నమోదు చేయలేదన్నారు. హజరత్తయ్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన డిప్యూటీ ఈఓ చంద్రమౌళీశ్వరరావు నుంచి ఎస్సై ఫిర్యాదు తీసుకోలేదని తెలిపారు.

☛ పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెం సర్వే నం.15/1లో 1.12 ఎకరాల భూమి పూర్వీకుల నుంచి వంశపారంపర్యంగా వచ్చిందని, దాన్ని దున్నేందుకు వెళుతుండగా గ్రామంలోని కొందరు దౌర్జన్యం చేస్తున్నారని గుమ్మళ్ల బ్రహ్మయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తిరిగి నాపై కల్లూరి వెంకటేశ్వర్లు, కల్లూరు శ్రీను, తలకాయ మాధవ దాడి చేయగా..ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. నా పొలంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని వాపోయాడు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎస్పీకి తాను చెబుతానని, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావును పిలిపించి ఎస్పీ వద్దకు తీసుకెళ్లాలని చెప్పారు.

☛ కొత్తపట్నంలోని ప్రభుత్వ ఆయుర్వేద స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కొత్తపట్నంకు చెందిన బొమ్మిదాల వాసులు ఫిర్యాదుచేశారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. స్పందించిన కలెక్టర్ ఆయుర్వేద విభాగానికి చెందిన వైద్యులను పిలిచి మందలించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే భవిష్యత్‌లో హాస్పిటల్ కట్టాలంటే ఏం చేస్తారని మండిపడ్డారు. కొత్తపట్నం తహసీల్దార్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగించాలని వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఖాశింబీ



క్షతగాత్రుడు నాయబ్ రసూల్‌ని చికిత్స కోసం అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

● కుమారుడికి స్వల్ప గాయాలు

పొన్నలూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోవడంతో తల్లి మృతి చెందగా కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన పొన్నలూరు మండలం వెంకుపాలెం సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు, బాధితుని వివరాలు మేరకు..కనిగిరి పట్టణం టకారిపాలెంకు చెందిన ఎస్‌కే ఖాసీంబీ(55), ఎస్‌కే నాయబ్ రసూల్ తల్లి, కొడుకులు. వీరిద్దరూ కందుకూరులోని తమ బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో వెంకుపాలెం గ్రామం దాటిన తరువాత ముందుగా పోతున్న కట్టెల ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసిన తర్వాత బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో వెనుక కూర్చున్న తల్లి ఖాశింబీ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. నాయబ్ రసూల్‌కి హెల్మెట్ ఉండటంతో స్వల్ప గాయాలయ్యాయి. ఖాశింబీకి తీవ్ర గాయాలయ్యాయి. అయితే 108 వాహనం రావడంతో ఆలస్యం కావడంతో కొద్దిసేపటి తర్వాత మృతి చెందింది. స్థానికులు స్వల్పంగా గాయపడిన నాయబ్ రసూల్‌ను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఖాసీంబీ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

● ఎస్పీ హర్షవర్ధనరాజు



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు సిటీ: ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి 116 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ హర్షవర్ధనరాజు అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. ప్రత్యేకించి వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లో అధికారులు స్పందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్, ఉద్యోగ మోసాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్సీ, ఎస్టీసెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, దర్శి సీఐ రామారావు, కనిగిరి సీఐ ఖాజావలి, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ కిందపడి యువకుడు మృతి



టిప్పర్ కింద శ్రీనివాసులు మృతదేహం



సంఘటనా స్థలంలో విలపిస్తున్న బంధువులు

కొనకనమిట్ల: కంకర లోడుతో వస్తున్న టిప్పర్ కింద పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గొట్లగట్టు బస్టాండ్ సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని గొట్లగట్టు గ్రామానికి చెందిన పొదిలి తిరుపతయ్య కుమారుడు శ్రీనివాసులు(28) ద్విచక్రవాహనంపై బస్టాండ్ నుంచి వస్తున్నాడు. అదే సమయంలో చీమకుర్తి నుంచి కంకరలోడుతో టిప్పర్ లారీ వస్తుండగా..శ్రీనివాసులు టిప్పర్ పక్కగా వెళుతూ ప్రమాదవశాత్తు కిందపడగా టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడు. మృతునికి భార్య లక్ష్మి, మూడేళ్ల పాప, 15 రోజుల పాప ఉన్నారు. 15 రోజుల క్రితమే శ్రీనివాసులు భార్య లక్ష్మి రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చి పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల్లో శ్రీనివాసులు తన భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్ల దగ్గరుకు వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే ఘోరం జరిగిందని శ్రీనివాసులు తండ్రి తిరుపతయ్య, బంధువులు బోరున విలపించిన తీరు స్థానికులు కంటతడి పెట్టారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఎస్సై వేమన, ఏఎస్సై ముల్లా మహమ్మద్‌లు సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదానికి కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసులు మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి

● ఎస్పీ హర్షవర్ధనరాజు



పామూరు సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పామూరు: పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను సోమవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై చర్చించారు. రాత్రిళ్లు గస్తీ, ట్రాఫిక్, ఇతర కేసుల వివరాలపై ఎస్సైతో చర్చించారు. సమస్యలపై స్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులను సత్వరం పరిశీలించి న్యాయంచేయాలని ఆదేశించారు. రాత్రిళ్లు పెట్రోలింగ్ ముమ్మరంచేయాలని, సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, పామూరు ఎస్సై టి.కిషోర్‌బాబు ఉన్నారు.

పొన్నలూరు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల పట్ల పారదర్శకంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులను తనిఖీ చేసి పలు అంశాలపై పోలీసులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలపై, నేర నివారణ వ్యూహాలపై నిత్యం సమీక్ష చేసుకోవాలన్నారు. బెల్ట్ షాపులు, పేకాటపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. నేర ప్రవర్తన కలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పీసీపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దొంగతనాలు నివారించేందుకు సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రోన్ కెమెరాలతో కోడిపందేలు, పేకాటపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్సై కోటయ్య ఉన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం



బొడ్డు వెంకటేశ్వర్లు మృతదేహం



చొప్పర శ్రీను మృతదేహం

టంగుటూరు: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని తూర్పు నాయుడుపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని ఆలకూరపాడు పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డిపాలెంకు చెందిన బొడ్డు వెంకటేశ్వర్లు(51), టంగుటూరు పంచాయతీ పరిధిలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చొప్పర శీను(43) ఇద్దరూ మోటార్ సైకిల్పై టంగుటూరు నుంచి ఒంగోలు వైపు వెళుతుండగా తూర్పునాయుడుపాలెంలో ఫ్లైఓవర్ దిగే క్రమంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని అంబులెన్సులో ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులిద్దరూ రైతులే. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృతులిద్దరూ రైతులే..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరూ రైతులే. బొడ్డు వెంకటేశ్వర్లు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటాడు. వెంకటేశ్వర్లుకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. చొప్పను శ్రీను ట్రాక్టర్ తోలుకుంటూ జీవనం సాగిస్తుండగా ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. రెండు కుటుంబాల్లో ఇంటి పెద్దలు మృతి చెందడంతో తీవ్ర శోకంలో మునిగిపోయాయి.



తూర్పునాయుడుపాలెం క్షతగాత్రులను తరలిస్తున్న సీఐ, ఎస్సై